ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

కంటోన్మెంట్: దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు మహాత్మాగాంధీ నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ గోపురం, స్వాగత తోరణాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాకే బోనాల పండుగకు నిధులు విడుదల చేయడం జరుగుతోందన్నారు. కంటోన్మెంట్ పరిధిలో తొలి విడతలో బోనాలు జరిగే మహాత్మాగాంధీ నగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయ అభివృద్ధి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, గెల్లు శ్రీనివాస్, శ్రీగణేశ్, క్రిష్ణ యాదవ్ పాల్గొన్నారు.


గోపురం ప్రారంభోత్సవంలో మంత్రి తలసాని

కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

కంటోన్మెంట్: రాబోయే ఎన్నికల్లో కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకే ఇవ్వాలని ఆ పార్టీ సీనియర్ నేత డీబీ దేవేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ వలస నేతలు కంటోన్మెంట్‌లో వాలిపోతున్నారని స్థానికేతరులకు టికెట్ ఇస్తే ఊరుకోమని హెచ్చరించారు. సీనియర్ నేతలు ఆయుబ్ ఖాన్, జమీల్, యాదగిరితో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 45 ఏళ్లగా పార్టీలోనే కొనసాగుతూ కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చానన్నారు. 2009లో దివంగత వైఎస్సార్ సూచన మేరకు పోటీ నుంచి తప్పుకుని, శంకర్రావుకు అవకాశమిచ్చామన్నారు. 2014లోనూ మరో స్థానికేతరుడైన గజ్జెల కాంతంకు టికెట్ ఇచ్చారని ఓటమి అనంతరం ఆయా నేతలు నియోజకవర్గాన్ని వీడి వెళ్లిపోయారని తెలిపారు. 2019లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గెలుపుకోసం అహర్నిశలు పని చేశామన్నారు. ఈ సారి ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని రేవంత్ రెడ్డిని కోరగా సానుకూలంగా ఉన్నప్పటికీ కొందరు తమదే టికెట్ అంటూ చెప్పుకోవడం సరికాదన్నారు.

ఉచిత విద్య, వైద్యం వైఎస్సార్ ఘనతే

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మెరుగైన వైద్య సేవలు, ఉన్నత ఉచిత వైద్యం వైఎస్సార్‌తోనే సాధ్యమైందని కొనియాడారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం


వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న వెల్లాల రామ్మోహన్


నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


గాంధీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న తడక జగదీశ్వర్ గుప్తా

ప్రొఫెసర్ కుమార్‌కు అరుదైన ఆహ్వానం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంకు అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. జూలై 17 నుంచి 21 వరకు కెనడాలోని మాంట్రియాల్‌లో జరుగనున్న 16వ ప్రపంచ రవాణా పరిశోధన సదస్సు డబ్ల్యూటీఆర్ చర్చలో ప్రొ.కుమార్ భాగస్వాములైన 'అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా ప్రయాణ ఆలస్యాన్ని తగ్గించటం' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు.

విజయ సంకల్ప సభకు బీజేపీ శ్రేణులు

చిలకలగూడ : వరంగల్‌లో శనివారం జరిగిన విజయ సంకల్ప సభకు సికింద్రాబాద్‌కు చెందిన బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామసుందర్‌గౌడ్, మేకల సారంగపాణి సీతాఫల్‌మండి మైలార్‌గడ్డలో జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్పొరేటర్ కేతినేని సరళ, నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, కన్నాభిరామ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనాథ్, వనమాల శ్రీనివాస్, జంగాల దేవుడు, రాజేశ్వర్, శ్రీధర్, వర్మ, హనుమంతు తరలివెళ్లారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం

చిలకలగూడ : నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళాతాళాలు, భాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శ్రీనివాసుని కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'మర్రి శశిధర్‌రెడ్డివి ఓటు బ్యాంక్ రాజకీయాలు'

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ ముస్లిం ఖబ్రస్తాన్ స్థలం కేటాయించడమే కాకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంటే.. మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ కమిటీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మహ్మద్ అఖిల్ అహ్మద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముస్లింల సంక్షేమం, వారి ఇబ్బందుల గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. హెచ్‌పీఎస్ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తూ ఖబ్రస్తాన్‌ను రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి తలసాని ఇచ్చిన హామీ మేరకు ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొని ముస్లింల 50 ఏళ్ల కల అయిన ఖబ్రస్తాన్‌కు రెండెకరాల స్థలం కేటాయించి ఇటీవలే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. మర్రి శశిధర్‌రెడ్డి ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ చొరవ చూపాలి

రాంగోపాల్‌పేట్: మణిపూర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపి శాంతిని నెలకొల్పేందుకు జాతీయ మానవ హక్కుల కమిషన్ చొరవ చూపించాలని క్రిష్టియన్ అడ్వకేట్ ఫోరం ఆఫ్ ఇండియా అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది సుధీర్ చాట్ల కోరారు. ఢిల్లీలోని మానవ హక్కుల కమిషన్‌ను కలిసి మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే నెల నుంచి మణిపూర్‌లో రెండు తెగల మధ్య రిజర్వేషన్లకు సంబంధించి జరుగుతున్న పోరాటం తీవ్రరూపం దాల్చి సుమారు 150 మంది క్రైస్తవ ట్రైబల్స్ ప్రాణాలు కోల్పోయారని 250 చర్చిలను తగులబెట్టారని దీంతో తీవ్ర భయానక పరిస్థితి నెలకొందన్నారు. ఇంత దారుణాలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ మాత్రం స్పందించడం లేదని ఈ విపత్కర పరిస్థితుల్లో శాంతికి రెండు వర్గాల ప్రజలతో శాంతి చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాస్టర్ మాథ్యూ, పాస్టర్ లిదియా పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

బౌద్ధనగర్/లాలాపేట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యమైన ఘటన వారాసీగూడ, ఓయూ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకుంది. ఏఎస్సై సుబ్బయ్య వివరాల ప్రకారం.. అంబర్‌నగర్ ప్రాంతానికి చెందిన తీగల నరేష్(35) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. ఈ నెల 5న పనికి వెళ్లిన నరేష్ రాత్రైనా ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శనివారం తల్లి హేమవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తార్నాకలో ఆర్టీసీ డ్రైవర్ ..

కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బాలరాజు(42) కడుపునొప్పితో బాధపడుతూ ఈ నెల 6న తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్‌లో చేరాడు. శనివారం మధ్యాహ్నం బాలరాజుకు సహాయకుడిగా ఉన్న అతని అల్లుడు భోజనం తీసుకురావడానికి వెళ్లిన సమయంలో బాలరాజు హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లి ఎంతకీ రాకపోవడంతో భార్య పద్మ ఓయూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మంత్రి తలసానికి అభినందనల వెల్లువ

సనత్‌నగర్: బేగంపేట ముస్లింల దశాబ్దాల కలను సాకారం చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో రెండెకరాల స్థలం కేటాయించడంతో పాటు నిర్మాణ పనుల కోసం రూ.3 కోట్లను కూడా కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బేగంపేటకు చెందిన పలువురు ముస్లింలు శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మంత్రిని కలిసి గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మసీద్ ఇమామ్ తస్లీం, ముస్లిం ప్రతినిధులు ఫారూఖ్, ఆరీఫ్, అష్రఫ్, వాహీద్, ఇమ్రాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శేఖర్ పాల్గొన్నారు.